# కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణం ఓ ఆహ్వానించదగిన చర్య

**కర్తార్‌పూర్** కారిడార్ నిర్మాణానికి చర్యలు చేపట్టటంతో, శిక్కులు పుణ్యక్షేత్రంగా భావించే పాకిస్తాన్‌లో నెలకొన్న చారిత్రాత్మక గురుద్వారాను శిక్కు యాత్రికులు దర్శించటానికి వున్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లయిందన్న మాట నిజం. అదే సమయంలో భారత్, పాకిస్తాన్‌లలోని శిక్కు ప్రజానీకం నడుమ మనమంతా ఒకటే అనే భావన దృఢపడటానికి కూడా దోహదపడుతోంది.

ఈ కారిడార్ గురించిన ఆలోచన ఎప్పుడు, ఎలా ఉద్భవించిందనే అంశంపై మన దేశంలో చర్చ జరుగుతోంది. ఏమైనా, రెండు దేశాలలోని శిక్కు ప్రజానీకమంతా పలు దశాబ్దాలుగా ఈ కారిడార్ నిర్మాణంకోసం డిమాండ్ చేస్తున్నారనేది ఒక వాస్తవం. ఈ కారిడార్ నిర్మాణంవలన డేరా బాబానానక్‌కు(భారతదేశం పరిధిలో 2 కి॥మీ) మరియు పాకిస్తాన్‌లోని కర్తార్‌పూర్ పుణ్యక్షేత్రానికి నడుమ దూరం 200 కి॥మీ నుండి 6 కి॥మీకు తగ్గిపోతుంది. (కర్తార్‌పూర్‌లో చివరి గురునానక్ 18 సం॥లు నివసించి 1539లో తనువు చాలించాడని శిక్కులు భావిస్తున్నారు) 2018 ఆగస్టులోనే, పాకిస్తాన్ నూతన ప్రధానిగా ఇమ్రాన్‌ఖాన్ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంలోనే, పాకిస్తాన్ సైనిక ప్రధానాధికారి కుమార్ బాజ్వా మనదేశంలోని పంజాబ్ రాష్ట్రంలో మంత్రిగానున్న నవజ్యోత్‌సింగ్ సిద్ధుకు కర్తార్‌పూర్ కారిడార్‌కు సంబంధించిన పాకిస్తాన్ ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియపరిచాడు. గురునానక్ 550వ జయంతి అయిన 2019 నవంబర్ 23న ఈ కారిడార్ నిర్మాణం పూర్తిచేసి ప్రారంభింపజేయాలని పాకిస్తాన్ ప్రభుత్వం ప్రతిపాదించింది. కర్తార్‌పూర్ క్షేత్రానికి బస్సులను నడిపే ప్రాంతంలో స్టేషన్ నిర్మాణం మొదలుకొని కర్తార్‌పూర్ వరకు రావీనదిపై 800 మీటర్ల వంతెన నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా వున్నాయి. యాత్రికు లందరికీ తాత్కాలిక వసతి సౌకర్యాలు, గుడారాల ఏర్పాటు వుంటుంది. వీరందరికీ 'వీసా'లు కాకుండా ప్రత్యేక అనుమతి పత్రాలు అవసరమౌతాయి.

అనేక సం॥లుగా భారత-పాకిస్తాన్‌ల నడుమ సంబంధాలు సాధారణంగా లేవనేది అందరికీ తెలిసిన విషయమే. సరిహద్దులలో ఉద్రిక్తతలు, పరస్పరం తలపడటాలు నిరంతరాయంగా, అంతులేకుండా సాగుతూనేవున్నాయి. భారతదేశంలో తీవ్ర నేరాలకు పాల్పడిన ప్రముఖ టెర్రరిస్టులకు పాకిస్తాన్ రక్షణ కల్పిస్తోందని భారత ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇస్లామిక్ టెర్రరిస్టులను పాకిస్తాన్ తయారుచేసి భారత దేశానికి పంపి, వారిచే అరాచకం సృష్టించాలని చూస్తోందని ఆరోపిస్తోంది. బిజెపి నాయకత్వంలోని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌తో పరస్పర సంబంధాలకు, చర్చలు జరిపేందుకు వున్న వివిధ అవకాశాలను, మార్గాలను మూసివేసింది. టెర్రరిస్టులను ప్రోత్సహించటం పాకిస్తాన్ మాననంతవరకు ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడవని తేల్చి చెబుతున్నారు.

కర్తార్‌పూర్ కారిడార్ ప్రతిపాదనకు పాకిస్తాన్ ప్రభుత్వం సమ్మతించటం, భారత పాలకులకు కలవరపాటు కలిగించే వార్తగా తోస్తోంది. అయితే శిక్కు ప్రజానీకం నడుమ ఈ ప్రతిపాదన ఎంతో సంతోషాన్ని, ఉత్సుకతను రేకెత్తించింది. ఇది శిక్కు ప్రజానీకపు చిరకాలపు కలగా వుంది. కరాఖండిగా, లేదా మొరటుగా ఈ ప్రతిపాదనను తిరస్కరించట మంటూ జరిగితే, అది మనదేశంలోని శిక్కు ప్రజానీకం నుండి ఆగ్రహాన్ని, నిరసనను ఎదుర్కోవలసి వుంటుందని భారత పాలకులకు తెలుసు. కనుక, ఈ ప్రతిపాదనకు అనుమతించటమే ఉత్తమమైనదని వారు భావించారు. అదే సమయంలో భారత - పాకిస్తాన్‌ల నడుమ సంబంధాలను మెరుగుపరచుకునే దిశలో కర్తార్‌పూర్ కారిడార్ ఒక ముందడుగు అనే ప్రభావాన్ని కల్పించటం భారత పాలకులకు ఇష్టంలేదు. భారత పాలకులు జాతీయ దురహంకారాన్ని రేకెత్తించే పనిలో నిమగ్నమై యున్నారు. పాకిస్తాన్ వ్యతిరేక మంటలు ఎగదోస్తూ వుండటం వారికి ఎంతైనా అవసరం. భారత ప్రభుత్వం భారత్-పాకిస్తాన్ సంబంధాల నుండి ఈ అంశాన్ని విడగొట్టుకుంటూనే, ఈ కారిడార్ ప్రాజెక్టుకు సహకరించాలని నిర్ణయించుకుంది. కనుక, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు, విద్వేషాలు యధాప్రకారం కొనసాగుతూనే వుంటాయి.

భారత్-పాకిస్తాన్‌ల నడుమ సంబంధాలను మెరుగుపరుచుకునే సమగ్ర చర్యలో భాగంగా, అదే సమయంలో సాధ్యమైతే సమస్యలను కూడా పరిష్కరించుకోవాలని ప్రస్తుత పాకిస్తాన్ ప్రభుత్వం కర్తార్‌పూర్ కారిడార్ ప్రాజెక్టును చూస్తున్నట్లుగా తోస్తోంది. వారివైపు నుండి దౌత్యపరంగా శాంతికోసం దూకుడుగా వ్యవహరించటంలో ఇది ఒక భాగం కావచ్చు.

మనదేశం పక్షాన, దేశ ఉపాధ్యక్షుడు వెంకయ్యానాయుడు, పాకిస్తాన్‌తో అంతర్జాతీయ సరిహద్దుకు 2 కి॥మీ దూరంలో, పంజాబ్ రాష్ట్రం, గురుదాస్‌పూర్‌లోని డేరా బాబానానక్ వద్ద 2018 నవంబర్ 26న నాలుగు వరుసల కారిడార్‌కు శంకుస్థాపన చేశాడు. వేలాదిమంది ప్రజల కేరింతల నడుమ "మన ప్రజలందరి శాంతికి, మరింత అభివృద్ధికి ఈ కారిడార్, మార్గాన్ని వేయగలద"ని ఆయన ఆశాభావం వ్యక్తంచేశాడు.

పాకిస్తాన్ పక్షాన, భారతదేశంతో అంతర్జాతీయ సరిహద్దుకు 4 కి॥మీ దూరంలో నున్న కర్తార్‌పూర్ పుణ్యక్షేత్రానికి పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పునాదిరాయి వేశాడు. పాకిస్తాన్ వ్యాపితంగా హాజరైన వేలాదిమంది శిక్కు ప్రజానీకాన్ని మరియు భారతదేశంనుండి హాజరైన శిక్కు యాత్రికులను ఉద్దేశించి ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడాడు. "ఈరోజు నేను పాకిస్తాన్ ప్రధానిగా, మా పార్టీగా, మా అన్ని రాజకీయ పార్టీలుగా, మా సైన్యంగా మేమంతా ఈరోజు ఒకే మాటమీద వున్నాం. మేము ముందుకు సాగాలనుకుంటున్నాం" అని పేర్కొన్నాడు. "గతకాలపు బంధనాలను బద్దలుకొట్టాలనే" కోర్కెను, ఆశను ఆయన వ్యక్తం చేశాడు. "గతం నుండి నేర్చుకోవాలి, అంతేతప్ప అందులో జీవించటానికి కాదు" అని పేర్కొన్నారు. భారత - పాకిస్తాన్‌ల నడుమ సంబంధాలను పునఃప్రారంభించాలని, భారత-పాకిస్తాన్‌ల నడుమ సమస్యల పరిష్కారానికి చర్చలు జరపటం మినహా మరో మార్గంలేదని నొక్కి చెప్పాడు. "మా పాకిస్తాన్ భూభాగం టెర్రరిజానికి తోడ్పటం పాకిస్తాన్‌కు ప్రయోజనకరమేమీ కాదు" అని చెప్పాడు.

ఇక్కడ పాకిస్తాన్ రాజకీయ నాయకత్వం, అదేవిధంగా శక్తివంతమైన సైనిక నాయకత్వం ఒకే గొంతుకతో చర్చలద్వారా భారత్–పాకిస్తాన్ సమస్యలను పరిష్కరించుకొని, మెరుగుపరుచు కోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. వారి ఆకాంక్షలు ఏమేరకు సాకారం అవుతాయో ఆచరణలో మాత్రమే రుజువు కాగలదు. అయినప్పటికీ, ప్రస్తుతానికి, వీరి ప్రకటనలు రెండు దేశాలలో వున్న నిజాయితీతో కూడిన ప్రజల ఆకాంక్షలను, కోర్కెలను ప్రతిబింబిస్తున్నాయని చెప్పవచ్చు. ఇరు దేశాల నడుమ, ఇరుదేశాల ప్రజలనడుమ శాంతియుత, సౌభ్రాతృత్వ సంబంధాలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అయితే, మనదేశంలో వైరుధ్యపూరిత అవగాహనలు వ్యక్తమయ్యాయి. భారతప్రభుత్వం కారిడార్ కోసం ఈ వైపు శంకుస్థాపన చేసింది. భారతదేశం వైపునుండి ఇరు దేశాల నడుమ సాధారణ సంబంధాలకొరకు ఏవిధమైన ముందడుగు వేయాలన్నా, పాకిస్తాన్ ప్రభుత్వం ముందస్తుగా భారతదేశానికి వ్యతిరేకంగా సాగంచే నేరాలన్నింటినీ వెనువెంటనే ఆపివేయాలనే ధోరణితో వ్యవహరిస్తూ వస్తున్నది. భారత సైనిక దళాల ప్రధానాధికారి జివిల్ బిపిన్‌రావత్ కర్తార్‌పూర్ కారిడార్ అంశంపై మాట్లాడుతూ "దానిని ఒంటరిచేసి చూడవలసి వుంటుంద"ని వ్యాఖ్యానించాడు. మరెవరికీ దానిని జోడించి చూడరాదన్నాడు. ఇస్లాం రాజ్యమైన పాకిస్తాన్ "స్వచ్ఛందంగా లౌకిక రాజ్యంగా ముందుకు రావాల"ని కూడా ఆయన సలహా ఇచ్చాడు. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమ్రిందర్ సింగ్, కర్తార్‌పూర్ కారిడార్ శంఖుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానం అందినా వెళ్ళకుండా నిరాకరించాడు. జమ్మూకాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖవద్ద భారత సిపాయిలు గాయపడకుండా లేదా ప్రాణాలొదల కుండా ఒక్కరోజు కూడ నడవటంలేదని దీనికి కారణంగా చూపాడు. అలాగే పంజాబ్ రాష్ట్రంలో పాకిస్తాన్ గూడఛారి సంస్థ ఐఎస్ఐ ఘోరమైన చర్యలకు పాల్పడటాన్ని మరో కారణంగా పేర్కొన్నాడు. ఏమైనా, పంజాబ్ మంత్రి అయిన నవజోత్‌సింగ్ సిద్ధు, కర్తార్‌పూర్ కారిడార్ శంఖుస్థాపన కార్యక్రమానికి సంతోషంగా హాజరయ్యాడు. అయితే, ఆవిధంగా హాజరవటమే పంజాబ్ రాష్ట్రంలో ఓ వివాదాంశంగా పరిణ మించింది.

ఒక్కసారి పరస్పర చర్చలు, కలయికలు ఎప్పుడైతే మూసివేయబడతాయో, అప్పటినుండి ఎవరైనా అంతులేని విద్వేషాలు, ఉద్రిక్తతలు, పరస్పర రక్తపాతంతో జీవించటానికే నెట్టబడతారు. చర్చలు సాగించటానికి అవకాశం ఏర్పడే ఏ చిన్నపాటి బలహీనమైన ఆధారాన్నైనా వుపయోగించుకోకుండా నిరాకరించటం, ప్రభుత్వం లేదా రాజకీయ నాయకత్వం యొక్క అపరిపక్వతను, పూర్తి బాధ్యతా రాహిత్యాన్ని తెలుపుతోంది. భారత పాలకులు దీనినే ఎంచుకున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదులు ఏనాడూ భారత – పాకిస్తాన్ దేశాల నడుమ శాంతిస్థాపన గురించి బోధించటానికి ప్రయత్నించలేదు. అంతేకాదు, భారత్–పాకిస్తాన్ దేశాలు రెండూ తమ స్వీయబాధ్యతతో శాంతియుతంగా చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వారేనాడూ కోరుకోవటంలేదు కూడా. వాస్తవానికి, భారత్–పాకిస్తాన్‌ల నడుమ ఉద్రిక్తతలు, విద్వేషాలు, యుద్ధం వంటి పరిస్థితులు కొనసాగుతూ వుండటంలోనే వారి స్వార్ధ ప్రయోజనాలు ఇమిడి వున్నాయి. ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకొని ఇరు దేశాలతో ఆయుధ వ్యాపారం సాగించి సూపర్ లాభార్జనకు అంతులేని అవకాశాలను అమెరికా సామ్రాజ్యవాదులు అందిపుచ్చు కుంటున్నారు. ఇరుదేశాల పాలకవర్గాలనూ సంపూర్ణంగా, దయనీయంగా సామ్రాజ్యవాదుల సహాయంకోసం ఆధారపడి వుండేవారిగా కట్టిపడేసు కోవటానికి ఈ పరిస్థితులు సామ్రాజ్యవాదులకు అంతులేని అవకాశంగా వున్నాయి. ఇరు దేశాలలోని పాలకులకూ వారి స్వార్ధ ప్రయోజనాలు ఇందులో ఇమిడి వున్నాయి. ప్రజలపై మరిన్ని ఆర్ధిక భారాలు మోపుతూ, ఈ కీలకమైన సమస్యపై దృష్టి నిలపకుండా ప్రజలను ప్రక్కదోవ పట్టించటానికి, సరిహద్దుల్లోని ఉద్రిక్తతలు పాలకులకు తోడ్పడు తున్నాయి. ఆయుధీకరణ కూడా ఆయా దేశాల పాలకవర్గాలకు ఓ గొప్ప ఆదాయ వనరుగా రూపొందింది.

చాలాకాలంగా, అమెరికాకు నమ్మకమైన మిత్రులుగా పాకిస్తాన్ పాలకులు సేవలందిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా సాగించిన యుద్ధంలో పాకిస్తాన్ పాలకులు వాస్తవంగా వారి ఏజెంట్లుగా వ్యవహరించారు. ప్రస్తుతం వారు అమెరికాతో సంబంధాలలో ఓ కీలకమైన దశగుండా సాగుతున్నారు. చైనాతో పాకిస్తాన్ పెంపొందించు కుంటున్న ఆర్ధిక, రాజకీయ, సైనిక సంబంధాల పట్ల అమెరికా పాలకులు ఆగ్రహంగా వున్నారు. చైనాతో సంబంధాల మార్గం నుండి పాకిస్తాన్‌ను తప్పించటానికి, పాకిస్తాన్ పాలకులపై అమెరికా వత్తిడి పెంచుతోంది; తిరిగి పాకిస్తాన్‌ను తమ పట్టులోనే వుంచుకోవాలని చూస్తోంది. భారత్‌తో సంబంధాలను మెరుగుపర్చుకోవాలనే పాకిస్తాన్ పాలకుల ప్రస్తుత చర్యలు ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించే ప్రయత్నం గావచ్చు. ఆసియా ఖండంలోను, ఆసియా – పసిఫిక్ ప్రాంతంలోను అమెరికా ఆధిపత్య విధానాలకు తమను తాము కట్టివేసుకునే విధానాలతో భారత పాలకులు చాలాదూరం ప్రయాణించారు. రానున్న కాలంలో అమెరికా తన ఆధిపత్య ప్రయోజనాల కొరకు భారత్‌పై మరింతగా ఆధారపడే అవకాశాలన్నీ వున్నాయి. ఈ పరిణామాలు భారతదేశానికి విపత్కరమైనవి. అమెరికా సామ్రాజ్యవాదుల కబంధహస్తాల కౌగిలినుండి విడిపడటం, భారత్ – పాకిస్తాన్ దేశాలు రెండింటికీ ప్రయోజనకరమైనది. భారత్ – పాకిస్తాన్ ఇరు దేశాలూ చర్చలద్వారా సమస్యలన్నీ పరిష్కరించుకొని, ఐక్యతను పెంపొందించుకోవటం రెండు దేశాల ప్రజలకూ ప్రయోజనకరమైనదిగా వుంటుంది. ఒక్కొక్క దేశాన్ని విడగొట్టి తమ ప్రయోజనాలకనుగుణంగా వినియోగించుకునే సామ్రాజ్యవాదుల నీచమైన క్రీడను ఈ విధానమే ఓడించగలుగుతుంది. ఒకదేశంపై మరొక దేశాన్ని ఎగద్రోలి, ఆయా దేశాలన్నింటిపై తమ సామ్రాజ్యవాద పట్టును బిగించి, ఆ ప్రాంతం మొత్తంపై తమ ఆధిపత్యాన్ని చెలాయించాలనే సామ్రాజ్యవాదులకు ఇది చెంపపెట్టు అవుతుంది.

కర్తార్‌పూర్ పుణ్యక్షేత్రానికి కారిడార్ నిర్మించే పధకం భారత్ – పాకిస్తాన్ దేశాల ప్రజల నడుమ సంబంధాలను పెంపొందించుకొనేందుకు, వారి మధ్య సౌభ్రాతృత్వ బంధాన్ని, ఐక్యతను బలోపేతం చేసుకునేందుకు ఓ చిన్నపాటి సానుకూల అడుగు కావాలని కోరుకుందాం.

OOOOOO